సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 3 । జూన్ । 2023



చీనీ టన్ను రూ.35 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.35 వేలు పలికాయి. మార్కెట్‌కు 380 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



నిబంధనలకు నీళ్లు!

జలం.. గరళంగా మారుతోంది. ధనార్జనే ధ్యేయంగా కొందరు కలుషిత నీటిని విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు.

8లో

గరిష్టం/కనిష్టం

39.8°/ 24.2°

జిల్లాలో శుక్రవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. మధ్యాహ్నం వరకు ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. సాయంత్రం ఆకాశం మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి గ్రూప్‌-1 మెయిన్స్ పరీక్షలు

- హాజరుకానున్న 522 మంది అభ్యర్థులు



కలెక్టర్ గౌతమి

అనంతపురం అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్‌–1 సర్వీసెస్ మెయిన్స్ పరీక్షలు శనివారం నుంచి ఈనెల 10వ తేదీ వరకు జరగనున్నాయని కలెక్టర్ గౌతమి శుక్రవారం తెలిపారు. జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఈ పరీక్షలకు 522 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులను ఉదయం 8.30 గంటల నుంచి 9.45 గంటలలోపు పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్‌తో పాటు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుతో పరీక్షకు హాజరవ్వాలన్నారు. కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఐటీ గాడ్జెట్లు, బ్లూటూత్, ఇతర కమ్యూనికేషన్ పరికరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించబోరన్నారు.

15 వరకూ ‘జన్ భాగిదారి’ వేడుకలు



మాట్లాడుతున్న మహేంద్ర రెడ్డి

ప్రశాంతి నిలయం: ‘నిపుణ్ భారత్’లో భాగంగా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 15వ తేదీ వరకూ ‘జన్ భాగిదారి’ వేడుకలు నిర్వహించనున్నట్లు సమగ్ర శిక్ష అకడమిక్ మానిటరింగ్ అధికారి మహేంద్ర రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన సమగ్రశిక్ష కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వేడుకల్లో భాగంగా ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల కోసం వివిధ రకాల కార్యక్రమాలు (రంగోలి, పద్యపఠనం, క్విజ్, చిత్రలేఖనం, కథలు చెప్పడం, వక్తృత్వ పోటీలు) రూపొందించామన్నారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల చేత నిపుణ్ భారత్ ప్రతిజ్ఞ చేయించాలన్నారు. ప్రతి మండల విద్యాధికారి ఆయా మండలాల్లోని ప్రాథమిక పాఠశాలలను సందర్శించి అక్కడ బోధన, అభ్యసన సామగ్రిలో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి జిల్లా స్థాయికి పంపించాలన్నారు. ఇందుకోసం ఈనెల 4వ తేదీలోపు 1 నుంచి 3వ తరగతి పిల్లలకు 7 విభాగాల్లో పోటీలు నిర్వహించాలన్నారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరచి వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

మడకశిరలో 5న జిల్లాస్థాయి ‘స్పందన’

పుట్టపర్తి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే జిల్లా స్థాయి ‘స్పందన’ కార్యక్రమాన్ని వచ్చే సోమవారం (5వ తేదీ) మడకశిరలో నిర్వహించనున్నట్లు డీఆర్‌ఓ కొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్ అరుణ్‌బాబు సమక్షంలో మడకశిరలోని అగ్రికల్చర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించే జిల్లా స్థాయి స్పందనను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారులంతా హాజరుకావాలని, గైర్హాజరైన అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

పింఛన్ పంపిణీ 95 శాతం పూర్తి



దిగువ చెర్లోపల్లిలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సుదర్శన్

పుట్టపర్తి అర్బన్: ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. గురువారం తెల్లవారుజాము నుంచే ఇంటింటికీ వెళ్లి పింఛన్ కానుక అందజేసిన వలంటీర్లు రెండోరోజు శుక్రవారం పింఛన్‌దారులు ఎక్కడుంటే అక్కడికే వెళ్లి పింఛన్ కానుక మొత్తాన్ని అందజేశారు. ఫలితంగా శుక్రవారం నాటికి జిల్లాలో పింఛన్ పంపిణీ 95 శాతం పూర్తయ్యింది. జిల్లాలో 2,62,688 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.72,94,67,000 మంజూరు చేసింది. ఇందులో ఇప్పటివరకూ 2,47,882 మందికి రూ.68,80,82,750 మొత్తాన్ని అందజేసినట్లు డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు. ఈ క్రమంలో పింఛన్ పంపిణీలో రాష్ట్రంలోనే శ్రీసత్యసాయి జిల్లా 6వ స్థానంలో నిలిచిందన్నారు. పింఛన్ పంపిణీకి మరో మూడు రోజుల గడువు ఉందని, ఆలోపు మిగతా వారికీ ‘వైఎస్సార్ పింఛన్ కానుక’ అందజేస్తామన్నారు.

సాగులో తోడుగా నిలుస్తాం

- వైఎస్సార్ యంత్రసేవతో రైతులకు ఎంతో మేలు
- ఎంపీ మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు
- జిల్లా రైతులకు 137 ట్రాక్టర్లు, 448 పనిముట్లు
- లబ్ధిదారులకు రూ.5.48 కోట్ల చెక్కు అందజేత



రైతులకు పంపిణీ చేసిన ట్రాక్టర్లు



ట్రాక్టర్ మేళాను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎంపీ మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుకు ప్రతి అడుగులోనూ తోడుగా నిలుస్తోందని ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ, కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు రాయితీతో ఇవ్వడంతో పాటు పంటకు మద్దతు కల్పిస్తోందన్నారు. సేద్యాన్ని మరింత సులువు చేసేందుకు సబ్సిడీతో యంత్ర పరికరాలు అందజేస్తోందన్నారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండులో నిర్వహించిన ‘వైఎస్సార్ యంత్ర సేవ’ పథకం మేళా–2 కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ ‘వైఎస్సార్ యంత్ర సేవ’ పథకం కింద జిల్లాలో 234 సీహెచ్‌సీ గ్రూపులకు రూ.15.138 కోట్ల ఖర్చుతో 137 ట్రాక్టర్లు, 448 వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశామన్నారు. అంతేకాకుండా రైతులకు అందించే సబ్సిడీ మొత్తం రూ.5.4 కోట్లు రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు. ఇందుకు సంబంధించిన మెగా చెక్కును అందజేశారు. రైతులంతా చిరుధాన్యాలు పండించి లాభాలను పొందాలని సూచించారు.

జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం..

ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీ మంగమ్మ మాట్లాడుతూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. ఆడిన మాట తప్పని శ్రీరాముని పాలనను సీఎం వైఎస్ జగన్ గుర్తు చేస్తుంటే, ధృతరాష్ట్రుని పాలనను చంద్రబాబు గుర్తు చేస్తున్నారని మండిపడ్డారు. పాలకుడు మంచివాడైతే ప్రకృతీ కరుణిస్తుందని, అందువల్లే జగన్ అధికారం చేపట్టినప్పటి నుంచీ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, భూగర్భ జలాలు పెరిగి పాడిపంటలతో రైతులంతా సంతోషంగా ఉన్నారన్నారు. అలాగే సీఎం జగన్ రైతు సంక్షేమమే ధ్యేయంగా వివిధ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఎస్సార్ రైతు భరోసా, వైఎస్సార్ యంత్ర సేవ, ఇన్‌పుట్ సబ్సిడీ, పంట నష్ట పరిహారం, సబ్సిడీ విత్తన కాయలు, ఎరువులు పంపిణీ, భూసార పరీక్షలు, ఆర్బీకేల ద్వారా క్రాప్ బుకింగ్, టార్పలిన్స్, స్ప్రేయర్లు, డ్రోన్స్, క్రాప్ ఇన్సూరెన్స్, పశు నష్ట పరిహారం, అమూల్ డెయిరీ ఏర్పాటు, సంచార పశు వైద్యశాల, పంట ఉత్పత్తుల నిలువకు గోడౌన్లు , 90 శాతం స్ప్రింక్లర్లు, డ్రిప్ ఏర్పాటు, గిట్టుబాటు ధరతో పంటల కొనుగోలు తదితర సుమారు 20 రకాల సంక్షేమ పథకాలతో రైతులను రాజులను చేస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా చేసుకుని పాలన సాగిస్తూ అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అగ్రి అడ్వయిజరీ బోర్డు చైర్మన్ అవుటాల రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబుళపతి, అగ్రి బోర్డు మండల చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, సోమందేపల్లి సొసైటీ అధ్యక్షుడు ఆదినారాయణ రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏడి ఏలు సనావుల్లా, కృష్ణమీనన్, స్వయంప్రభ, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ట్రాక్టర్ కొనుగోలు చేస్తాననుకోలేదు



నా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా జీవితంలో ట్రాక్టర్ కొనుగోలు చేస్తాననుకోలేదు. కానీ ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వడంతో కొనగలిగా. ట్రాక్టర్‌తో నా పొలం పనులు హాయిగా చేసుకుంటాం. తక్కువ అద్దెకే మా గ్రామంలోని రైతుల పనులూ చేసిపెడతా. ఇలాంటి ట్రాక్టర్ మేళాలు నిర్వహించడం వల్ల నాలాంటి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

– శ్రీనివాసరెడ్డి, రైతు, వేపరాల, గాండ్లపెంట మండలం

రూ.1.50 లక్షలకే కోరిన ట్రాక్టర్



వైఎస్ జగన్ పుణ్యాన నాకు, నాలాంటి రైతులకు రూ.1.50 లక్షలకే కోరిన ట్రాక్టరు దక్కించుకున్నాం. రూ.15 లక్షల విలువైన ట్రాక్టర్ కొనుగోలుకు సబ్సిడీ ఇవ్వడంతో పాటు బ్యాంకు ద్వారా రుణం ఇప్పించారు. ఏ ప్రభుత్వంలోనూ ఇలాంటి పథకాన్ని చూడలేదు. ఇదేగాక నా కుటుంబానికి వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.3.5 లక్షలు అందింది.

– శ్రీరాములు, ఓబుళరెడ్డిపల్లి, తలుపుల మండలం

జగన్‌కు రుణపడి ఉంటాం



నాకు ఇప్పటికే ట్రాక్టర్ ఉండటంతో హార్వెస్టర్ కొనుగోలు చేశా. నా పొలం పనులు చేసుకుని తోటి రైతులకు అతితక్కువ అద్దెకు పనులు చేస్తా. యంత్ర పరికరాలకు ఇంత పెద్ద మొత్తంలో సబ్సిడీ ఏ ప్రభుత్వమూ ఇవ్వలేదు. రైతుల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌కు మా కుటుంబాలన్నీ రుణపడి ఉంటాయి.

– వెంకటరెడ్డి, కోనాపురం, పుట్టపర్తి మండలం

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- సిబ్బందికి ఎస్పీ మాధవరెడ్డి ఆదేశం
- అగళి, రొళ్ల, రొద్దం స్టేషన్ల తనిఖీ



కేసుల దర్యాప్తుపై అగళి ఎస్‌ఐ లావణ్యను ఆరా తీస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

మడకశిర(అగళి)/రొళ్ల/రొద్దం: శాంతిభద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని, అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ మాధవరెడ్డి సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన రొళ్ల, అగళి, రొద్దం పోలీసు స్టేషన్లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయా స్టేషన్ల పరిధిలో నమోదైన కేసులు, దర్యాప్తుపై ఆరా తీశారు. వివిధ కేసుల్లో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, అంతర్‌రాష్ట్ర చెక్ పోస్టుల్లో నిఘా మరింత పెంచాలన్నారు. వేసవిలో చోరీలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుందని, దీన్ని అరికట్టేందుకు బీట్లు పెంచాలన్నారు. మట్కా, జూదం మద్యం, ఇసుక అక్రమ రవాణాకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించాలని, తరచూ ప్రమాదాలు చోటుచేసుకునే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులు నాటించాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి వారి సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించాలన్నారు. గ్రామాల్లో ఘర్షణలు, దౌర్జన్యాలు, మహిళలపై వేధింపులు, ఈవ్‌టీజింగ్ వంటి జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో గ్రామాల్లో గస్తీ తిరుగుతూ అనుమానితులను విచారించాలన్నారు. ఈ సందర్భంగా మడకశిర నియోజకవర్గంలో పండే పంటల వివరాలను కూడా ఎస్పీ తెలుసుకున్నారు. ఎస్పీ వెంట సీఐ సురేష్‌బాబు, అగళి ఎస్‌ఐ లావణ్య, రొళ్ల ఎస్‌ఐ వెంకటరమణ, రొద్దం ఎస్‌ఐ నాగస్వామి, సిబ్బంది ఉన్నారు.

దోచిపెట్టేందుకు ‘పచ్చ’పాతం

ఆర్‌అండ్‌బీలో అవినీతి జలగ

- టీడీపీ నేత తమ్ముడికి జీహుజూర్
- కాసులకు కక్కుర్తి పడి సింగిల్ బిడ్డర్‌కే గ్రీన్ సిగ్నల్
- రివర్స్ టెండరింగ్ లేకుండానే అగ్రిమెంటు పూర్తి
- ప్రభుత్వానికి భారీగా నష్టం



సాక్షి ప్రతినిధి, అనంతపురం: రోడ్లు, భవనాల శాఖలో భారీగా అవినీతి జరిగింది. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై భారీ స్కామ్‌కు తెరలేపారు. నిబంధనలకు విరుద్ధంగా సింగిల్ టెండర్‌కు ఓకే చేసి కాంట్రాక్టర్‌కు మేలు చేశారు. కాసుల కోసం లాలూచీ పడి ఖజానాకు చిల్లు పెట్టారు.

టీడీపీ నేతతో కుమ్మక్కు..

టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ తమ్ముడు మడకశిరలో కాంట్రాక్టరు. ఈయన కోసం ఆర్‌అండ్‌బీ పెద్దలు సాగిలపడ్డారు. ఇటీవలే మడకశిర నియోజక వర్గంలో పరిగి-యు రంగాపురం, అమరాపురం-మధూడి, మధూడి-గాయత్రి కాలనీలో రోడ్డుపనులకు టెండర్లు పిలిచారు. ఈ మూడు వర్కులకు సంబంధించిన పనుల విలువ రూ.6.45 కోట్లుపైనే. సాధారణంగా ఏదైనా పనికి సింగిల్ టెండరు వస్తే వీటిని మళ్లీ టెండరుకు పిలవాలి. కానీ ఇలా చేయకుండా నేరుగా ఇచ్చారు. డీఈలు ఇచ్చిన ఎస్టిమేషన్లు (అంచనాలు) కనీసం సమీక్షించలేదు. పైగా అంచనాలు భారీగా పెంచేసి వర్కులు వచ్చారు. ఈ తతంగంలో ఆర్‌అండ్‌బీలో ఉన్నతాధికారి ఒకరు కీలకంగా వ్యవహరించి కాంట్రాక్టరుకు లబ్ధి చేకూర్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వర్కుల వివరాలు ఇవే

కేటగిరీ	ప్రాంతం	పని విలువ
ప్రత్యేక మరమ్మతులు	పరిగి-యు.రంగాపురం	రూ.2.35 కోట్లు
ప్రత్యేక మరమ్మతులు	అమరాపురం-మధూడి	రూ.2.15 కోట్లు
ప్రత్యేక మరమ్మతులు	మధూడి-గాయత్రి కాలనీ	రూ.2.04 కోట్లు

రివర్స్ టెండర్‌కు మంగళం..

ఏదైనా ఒక పనికి సింగిల్ టెండర్ దాఖలైతే నిబంధనల ప్రకారం రెండో కాల్‌కు వెళ్లాలి. రెండో కాల్‌కూడా రానప్పుడు మూడో కాల్‌లో ఫైనల్ చేయాలి. ఇవేవీ లేకుండా సింగిల్ టెండర్‌కే అధికారులు పనులు అప్పగించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా 80 శాతం, 20 శాతం స్టేట్‌బ్యాంక్ నిధులతో నిర్మించాల్సిన ఈ రోడ్లలో భారీగా కమీషన్లు ముట్టినట్టు తెలుస్తోంది. కొద్ది రోజుల క్రితమే ఈ వర్కులకు సంబంధించి కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ కూడా చేసుకున్నారు. ఇందులోనూ మతలబు చేశారు. ఈ పనులన్నీ ఒకే వర్క్ కింద చూపితే పెద్ద కాంట్రాక్టర్లు వస్తారన్న ఉద్దేశంతో ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారి మెలిక పెట్టారు. దీంతో టీడీపీ నేత తమ్ముడికి లబ్ధికలిగేలా ఈ పనులను ముక్కలుగా చేసి ఇచ్చారు. సదరు ఉన్నతాధికారి గతంలో నేషనల్ హైవేస్‌లో పనిచేసినప్పుడు కూడా భారీగా అవినీతికి పాల్పడినట్టు ఆరోపణలున్నాయి.

అది నా దగ్గర శాంక్షన్ కాలేదు

సంవత్సరం క్రితం కొన్ని పనులకు అనుమతులిచ్చాం . తాజాగా నేను ఏ పనికీ అనుమతి ఇవ్వలేదు. సింగిల్ టెండర్ వస్తే రెండో టెండర్‌కు వెళ్లాల్సిందే. దీనిపై పూర్తి సమాచారం నాకు తెలియదు. ఒక్కసారి పరిశీలన చేస్తా. మడకశిరలో కాంట్రాక్టర్లు సరిగా ముందుకు రాని మాట వాస్తవమే.

– నయీముల్లా, ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ

బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని లేఖ రాశా

టీడీపీ మాజీ ఎమ్మెల్సీ తమ్ముడు అధికారులతో కుమ్మక్కై టెండర్లు వేస్తాడు. అగ్రిమెంట్లు చేసుకున్న తర్వాత పనులు చేయకుండా వదిలేస్తాడు. అందుకే అతన్ని బ్లాక్‌లిస్టులో పెట్టాలని సీఎంఓకు లేఖ రాశా. ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీని కలిసి చెప్పా. అయినా ఆ కంపెనీని అధికారులు బ్లాక్‌లిస్ట్‌లో ఉంచలేదు. మడకశిర నియోజకవర్గంలో చాలా వర్కులు పెండింగ్‌లో ఉంచడం వల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది. కాంట్రాక్టర్‌ను మార్చాలని చెబితే... మరో సంస్థ పేరుమీద టెండరు వేసి పని అతనికే అప్పగించారు. దీనివెనుక భారీగా సొమ్ములు మారినట్టు నా దృష్టికి వచ్చింది.

– తిప్పేస్వామి, శాసనసభ్యులు, మడకశిర

• గాలీవాన బీభత్సం



పుట్టపర్తి అర్బన్: గాలీవాన బీభత్సం సృష్టించింది. గురువారం రాత్రి పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల్లో భారీ వర్షం కురిసింది. వర్షానికి పెనుగాలులు తోడుకావడంతో చాలా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, భారీ వృక్షాలు నేల కూలాయి. దీంతో పలు ప్రాంతాలకు రాకపోకలు స్తంభించాయి. కప్పబండ నుంచి కొత్తచెరువు వరకూ దాదాపు 9 విద్యుత్ స్తంభాలు విరిగి పడడంతో గురువారం రాత్రంతా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. శుక్రవారం ఉదయమే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. జేసీబీలతో భారీ వృక్షాలను తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. ఇక కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధరించినట్లు ఏఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు.

8 మండలాల్లో వర్షం..

గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ జిల్లాలో 8 మండలాల్లో వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పుట్టపర్తి మండలంలో అత్యధికంగా 22.4 మి.మీ వర్షపాతం నమోదైందన్నారు. ఇక చెన్నేకొత్తపల్లిలో 11.4 మి.మీ, కొత్తచెరువు 5.8, కనగానపల్లిలో 5.4, తాడిమర్రి 4.2, బుక్కపట్నం 4, చిలమత్తూరు, హిందూపురం మండలంలో 3.8 మి.మీ మేర వర్షం కురిసినట్లు వెల్లడించారు.

సాక్షి మీడియా గ్రూప్, ఆర్.సి ఎగ్జామ్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో

గ్రూప్‌-2 ఉద్యోగ పరీక్షలపై రేపు ఉచిత అవగాహన సదస్సు

- ఉదయం 09:30 నుంచి 12:30 గంటల వరకు
- టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రామాణిక స్టడీ మెటీరియల్

సాక్షి ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్‌లో భారీ ఎత్తున గ్రూప్‌–2 ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దాదాపు 1,000 వరకు గ్రూప్‌–2 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనుంది. ఈ నేపథ్యంలో గ్రామీణ విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com) రాష్ట్రంలోని ప్రముఖ పోటీ పరీక్షల సంస్థ ఆర్.సి ఎగ్జామ్స్‌తో కలిసి జూన్ 4వ తేదీ ఉదయం 09:30 నుంచి 12:30 వరకు అనంతపురంలోని Ambedkar Convention Centre, Sai Nagar నందు ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తోంది. గత కొన్ని సంవత్సరాలుగా వివిధ పోటీపరీక్షలకు ప్రిపేరయ్యే అభ్యర్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ తోడుగా ఉంటున్న విషయం మీ అందరికీ తెలిసిందే. హాజరయ్యే విద్యార్థులు ముందుగా 8985094499 ఫోన్ నెంబరుకు తమ పేరు, ఫోన్ నెంబర్, జిల్లా వివరాలను వాట్సప్‌లో పంపాలి.

అవగాహన సదస్సు తేదీ : జూన్ 4, 2023
వేదిక : అంబేద్కర్ కన్వెన్షన్ సెంటర్, సాయినగర్, అనంతపురం
సమయం : ఉదయం 09:30 నుంచి 12:30 వరకు

పూడికతీతతో చెరువులకు పూర్వ వైభవం



నల్లమాడ: అమృత్ సరోవర్’ పనులు పరిశీలిస్తున్న తనూజ ఠాకూర్, ఈజీఎస్ డైరెక్టర్ చిన తాతయ్య తదితరులు

- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ తనూజ ఠాకూర్

ఓడీ చెరువు/నల్లమాడ/ధర్మవరం రూరల్ : ‘అమృత్ సరోవర్’ పథకం కింద చేపట్టిన పూడికతీత పనులతో చెరువుల్లో నీటి నిల్వ సామర్థ్యం పెరిగి వాటికి పూర్వ వైభవం వస్తుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ తనూజ ఠాకూర్, ఈజీఎస్ డైరెక్టర్ చిన తాతయ్య అన్నారు. శుక్రవారం వారు కేంద్ర బృందంతో కలిసి జిల్లాలోని ఓడీచెరువు, నల్లమాడ, ధర్మవరం మండలాల్లో పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ‘అమృత్ సరోవర్’ పథకంలో భాగంగా చేపట్టిన పనులను పరిశీలించారు. తొలుత ఓడీ చెరువు మండలం వెంకటాపురం గ్రామం దండియాల చెరువులో చేపట్టిన ‘అమృత్ సరోవర్’ పనులను పరిశీలించారు. పూడికతీత పనులు పూర్తయినట్లు రికార్డుల్లో నమోదు చేశారని, ఇక్కడ మాత్రం 25 శాతం పనులు కూడా పూర్తి చేయలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. రెండు నెలల్లో పనులు పూర్తి చేయాలని ఎన్ఆర్‌ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సర్పంచు శివశంకర్‌రెడ్డి అధ్యక్షతన ఉపాధి కూలీలు, గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ప్రజల జీవన విధానం, పంటల సాగు, ఉపాధి కూలీలకు పనుల వల్ల కలిగే ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నల్లమాడ మండలంలోని చౌటకుంటపల్లి వద్ద రైతు గంగాధర్ పొలంలో ఉపాధి హామీ పథకం కింద సాగుచేసిన మామిడి తోటను పరిశీలించారు.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాలు వృద్ధి..

సాయంత్రం కేంద్ర బృందం సభ్యులు కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి ధర్మవరం మండలం బుడ్డారెడ్డిపల్లిలో చేసిన అమృత్ సరోవర్ పనులను తనిఖీ చేశారు. అక్కడే ఉన్న రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఇంకుడు గుంతలతో భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయని, తద్వారా సాగునీటికి ఇబ్బందులు తప్పుతాయన్నారు. వీరి వెంట ఆర్డీఓ తిప్పేనాయక్, ఈజీఎస్ జాయింట్ కమిషనర్ శివప్రసాద్, డ్వామా పీడీలు వేణుగోపాల్‌రెడ్డి, రామాంజనేయులు, ధర్మవరం తహసీల్దార్ యోగీశ్వరీదేవి, ఎంపీడీఓ మమతాదేవి, ఓడీసీ ఎంపీటీసీ శ్రీనివాసులు, ఎంపీడీఓ పోలప్ప ఉన్నారు.

క్లుప్తంగా

పరిసరాల శుభ్రతపై అవగాహన



ఎం.కొట్టాలలో పర్యటిస్తున్న డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి

ముదిగుబ్బ: మండల పరిధిలోని మలకవేమల పీహెచ్‌సీని శుక్రవారం డీఎంఅండ్‌హెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఎం.కొట్టాల గ్రామంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ జూన్ నుంచి నవంబర్ వరకు వర్షాలు కురుస్తాయి కాబట్టి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పరిసరాల శుభ్రత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ నాగేంద్రనాయక్, ఏఎంఓ లక్ష్మీనాయక్, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ దేవల నాయక్, సూపర్‌వైజర్ శశిధర్, పీహెచ్ఎన్ లక్ష్మీనరసమ్మ, ఎంపీహెచ్ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఏఎన్ఎం కృష్ణవేణి, ఎంపీహెచ్ఎస్ హరినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల రక్షణే ధ్యేయం



మాట్లాడుతున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మంజుల

పుట్టపర్తి అర్బన్: ఆర్టీసీలో పని చేస్తున్న మహిళా ఉద్యోగుల రక్షణే ధ్యేయంగా మహిళా వేధింపుల కమిటీ పని చేస్తుందని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి ఆర్టీసీ రీజనల్ కార్యాలయంలో ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం ఎన్నో చర్యలు తీసుకుంటోందన్నారు. దిశ చట్టం మహిళలకు వరం లాంటిదన్నారు. అనంతరం మహిళా ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడైనా మహిళలు వేధింపునకు గురైతే కమిటీ సభ్యులు ప్రత్యక్షమవుతారన్నారు. ఈ మహిళా వేధింపుల కమిటీకి చైర్‌పర్సన్‌గా మంజుల, అడ్వకేట్ జయకళ, మెంబర్లుగా శోభరాణి, హంపన్న, కళ్యాణిలను ఎంపిక చేశారు. సమావేశంలో ఆర్ఎం మధుసూధన్, డిపో మేనేజర్ ఇనాయితుల్లా, పర్సనల్ ఆఫీసర్ ఉషారాణి, హంపన్న, పార్థసారధిరెడ్డి, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు నీళ్లు!



హిందూపురానికి చెందిన శ్రీరాములు వెన్నెముక సమస్యతో అనంతపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. కలుషిత నీరు తాగడం కారణంగా సమస్య తలెత్తినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఇంటికి సమీపంలోని వాటర్ ప్లాంట్ నుంచి నీళ్లు తెచ్చుకుంటున్నట్లు చెప్పారు. అయితే అనారోగ్యం బారిన పడతాననే విషయం పసిగట్టలేదని వాపోయారు.

కదిరి పట్టణానికి చెందిన నారాయణప్ప కీళ్ల నొప్పులతో ఏరియా ఆస్పత్రికి వెళ్లారు. పరీక్షలు చేసిన అనంతరం తాగునీటి కారణంగా సమస్య వచ్చినట్లు వైద్యులు తెలిపారు. ఓ ప్రైవేటు వాటర్ ప్లాంట్ నిర్వాహకులు ఇంటి వద్దకే వచ్చి క్యాన్ విక్రయిస్తున్నట్లు తెలిపారు. కీళ్ల నొప్పులు వస్తాయని ఆలోచించలేదన్నారు. అధికారులకు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.



- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లు
- నిబంధనలు తుంగలో తొక్కి ప్రజలకు నీటి సరఫరా
- అనారోగ్యం బారిన జనం
- మామూళ్ల మత్తులో అధికారులు

సాక్షి, పుట్టపర్తి: జలం.. గరళంగా మారుతోంది. ధనార్జనే ధ్యేయంగా కొందరు కలుషిత నీటిని విక్రయిస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. పల్లె, పట్టణం తేడా లేకుండా పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న మినరల్ వాటర్ ప్లాంట్లతో ఎంతో మంది అనారోగ్య సమస్యల బారిన పడుతున్నారు.

మొద్దునిద్రలో అధికారులు..

పుట్టపర్తి, పెనుకొండ, హిందూపురం, ధర్మవరం, కదిరి, మడకశిర పట్టణాల్లో సుమారు 100 వాటర్ ప్లాంట్లు ఉన్నాయి. ఇందులో కనీసం 20 వాటర్ ప్లాంట్లకు కూడా అనుమతులు లేవు. ప్రతి ఏటా రెన్యూవల్ చేసుకోవాలి. కానీ ఓసారి అనుమతి తీసుకుని యథేచ్ఛగా దందా కొనసాగిస్తున్నారు. పల్లెల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న వాటర్ ప్లాంట్లు ఉండటంతో ఎలాంటి సమస్య లేదని చెబుతున్నారు. అయితే పట్టణాల్లో ప్రైవేటు వాటర్ ప్లాంట్ల కారణంగా ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటోందని చెబుతున్నారు. మినరల్ వాటర్ దందా యథేచ్ఛగా కొనసాగుతున్నా.. మామూళ్ల మత్తులో అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలున్నాయి.

నిబంధనలు ఇవీ..

- ప్లాంట్ నిర్వహణకు బీఎస్ఐ అనుమతి ఉండాలి. ఐఎస్ఐ నిబంధనలు పాటించాలి.
- పరిశ్రమలశాఖ నుంచి పార్టు–1 లైసెన్సు పొందాలి.
- ప్రయోగశాలతో పాటు ఆవరణ పరిశుభ్రంగా ఉండాలి.
- ప్లాంట్‌కు మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ అనుమతి తీసుకోవాలి.
- మైక్రోబయాలజీ, కెమిస్ట్రీ సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి.
- ప్రతీ క్యాన్‌పై శుద్ధి చేసిన తేదీ, బ్యాచ్ నంబర్ ఉండాలి.
- క్యాన్లను రోజూ పొటాషియం పర్మాంగనేట్‌తో శుభ్రపరచాలి.
- మినరల్ వాటర్‌ను క్యాన్‌లో పెట్టే ముందు అల్ట్రా వైరస్ రేస్‌తో శుద్ధి చేయాలి.
- రెండు రోజుల పాటు నీటిని నిల్వ చేసి తర్వాత మార్కెట్‌లోకి పంపించాలి.
- నీటిని క్యాన్‌లో నింపేవారు చేతులకు గ్లౌజులు వినియోగించాలి.
- శుద్ధి చేసిన నీటిని 304 గ్రేడ్‌ స్టెయిన్‌లెస్ స్టీలుతో తయారు చేసిన పెద్ద ట్యాంకులో నింపి ఓజోనైజేషన్ చేయాలి.
- పీహెచ్ స్థాయి ఏడు కంటే తగ్గకుండా చూసుకోవాలి. తగ్గితే ఆ నీరు తాగిన వారికి కిడ్నీ సంబంధిత వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది.
- ప్రతి మూడు నెలలకు ఓసారి రా వాటర్ టెస్టింగ్ జరపాలి. ప్లాస్టిక్ బాటిళ్లు, ప్యాకెట్లలో నిర్ణీత మైక్రోన్స్ ఉండాలి. కానీ జిల్లా వ్యాప్తంగా ఇందులో ఏ ఒక్క నిబంధన కూడా వాటర్ ప్లాంట్ నిర్వాహకులు పాటిస్తున్న దాఖలాలు లేవు.

తనిఖీలు చేపడతాం



వాటర్ ప్లాంట్ల పనితీరుపై ఎప్పటికప్పుడు వివరాలు ఆరా తీస్తున్నాం. రెన్యువల్ చేసుకోవాలని హెచ్చరిస్తున్నాం. నిబంధనలు పాటించని వారికి నోటీసులు ఇస్తున్నాం. తనిఖీలు చేపట్టి.. కలుషిత నీరు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– రామచందర్, ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి

9వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు: మండలంలో టేకులోడు క్రాస్‌లోని మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో 9 తరగతిలో ఏర్పడిన ఖాళీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శశిభూషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ 9లో చేరేందుకు మొత్తం రెండు ఖాళీలుండగా ఎస్సీ–1, ఎస్టీ –1 సీట్లు ఉన్నాయన్నారు. ఈ నెల 12 వరకు దరఖాస్తుకు సమయం ఉందని, 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

చెరువులో జారిపడి గొర్రెల కాపరి మృతి



మృతి చెందిన మంజునాథ

అమరాపురం: మండలంలోని కొర్రేవు గ్రామ గొల్లహట్టికి చెందిన వీరన్న కుమారుడు గొల్ల మంజునాథ (40) శుక్రవారం నిద్రగట్ట చెరువులోకి జారిపడి మృతి చెందారు. ఏఎస్ఐ రామంజనేయులు, గొల్ల కాపరుల వివరాల మేరకు... శుక్రవారం ఉదయం కొర్రేవు గొల్లహట్టి నుంచి స్నేహితులతో కలసి గొర్రెలను నిద్రగట్ట చెరువు వద్దకు తీసుకొచ్చారు. చెరువులో గొర్రెలను గొర్రెల కాపరులు ఈత చేయిస్తుండగా అకస్మాత్తుగా గొర్రెల కాపరి మంజునాథ చెరువులో కాలు జారి పడిపోయారు. అయితే అక్కడున్న గొర్రె కాపరులకు ఈత రాక పోవడంతో కట్టమీదకు వచ్చి దారిన పోయే వారిని పిలవగా వారు వచ్చి చెరువులోకి దిగి గాలించగా మంజునాథ అప్పుడే మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ రామంజనేయులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మడకశిర ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

పెళ్లి మండపంలో భారీ చోరీ

- రూ.7.50 లక్షలతో పాటు బంగారం మాయం
- లబోదిబోమంటున్న ఆడబిడ్డ తల్లిదండ్రులు

అనంతపురం శ్రీకంఠంసర్కిల్: ఆడబిడ్డ పెళ్లికి ఖర్చు చేయాల్సిన సొత్తును దొంగ దోచుకెళ్లిన ఘటన అనంతపురం నగర శివారుల్లోని నీలం రాజశేఖరరెడ్డి కల్యాణ మండపంలో గురువారం చోటు చేసుకుంది. నాల్గవ పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాప్తాడుకు చెందిన బిల్లేనారాయణస్వామి కుమార్తెని, వేపకుంటకు చెందిన సోమన్న కుమారుడు (ప్రస్తుతం తిరుమలలో వైద్యుడు)కి ఇచ్చి వివాహం చేయాలని ఇరు కుటుంబాల పెద్దలు నిర్ణయించారు. ఇందులో భాగంగా అనంతపురం శివారుల్లోని నీలంరాజశేఖర రెడ్డి కల్యాణ మండపంలో మే 31 ముహూర్తం కాగా 1న తలంబ్రాలు జరిగాయి. గురువారం పెళ్లి వేడుకకు హాజరైన బంధువులు, మిత్రులు నూతన వధువరులకు తెచ్చిన బహుమతులను వధువు తల్లిదండ్రులు ఓ గదిలోకి సర్దుతున్నారు. ఈ సమయంలో బిల్లే నారాయణస్వామి తన చేతిలో ఉన్న రూ.7.50 లక్షలతో పాటు రెండు తులాల బంగారు నగలున్న బ్యాగును వారికి కేటాయించిన సేఫ్టీ గదిలో దాచారు. అదే గదిలో వధువుకు వచ్చిన గిఫ్టులను ఓ పక్కకు సర్దారు. తీరా డబ్బున్న బ్యాగు వైపు చూడగా అది కనిపించలేదు. దీంతో అనుమానం వచ్చి కల్యాణ మండపం మొత్తం గాలించారు. గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆ గదిలోంచి బయటకు వచ్చినట్లు తోటి వారు చెప్పడంతో తెలుసుకున్న బాధితులు విషయాన్ని నాల్గవ పట్టణ పోలీసులకు తెలిపారు. హుటాహుటిన అక్కడికి చేరుకున్న పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా దొంగను గుర్తించే పనిలో పడ్డారు. కాగా ఓ వ్యక్తి మండపం నుంచి బయటకు వెళ్లడం కనిపించింది. అతనే దొంగా? కాదా? అన్నది తెలియాల్సి ఉంది. పెళ్లికి ఖర్చు పెట్టాలనుకున్న డబ్బు మాయం కావడంతో బాధిత కుటుంబ సభ్యులు ఇబ్బంది పడ్డారు.

దొంగల జాబితాతో..

కల్యాణ మండపాల్లో చోరీలకు పాల్పడే దొంగల జాబితాను వెలికి తీసిన పోలీసులు దొంగను పట్టుకునేందుకు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. గతంలో ఇలాంటి నేరాలతో సంబంధాలున్న వారిని స్టేషన్‌కు పిలిపించి విచారిస్తున్నారు. కల్యాణ మండపంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తి ఫొటోను సేకరించారు. ఈ ఫొటో ఆధారంగా దొంగ కోసం గాలిస్తున్నారు.

ఆటో ఢీకొని బాలుడి మృతి

గుంతకల్లు రూరల్: మండల పరిధిలోని నెలగొండ గ్రామంలో శుక్రవారం ఆటో ఢీ కొనడంతో షాన్వాజ్ (4) అనే బాలుడు మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. నెలగొండ గ్రామానికి చెందిన రుక్మాన్ బాషా, ఖాదర్‌బీ దంపతుల కూతురు అయిన మున్నీని 13 సంవత్సరాల క్రితం గుంతకల్లు మండలంలోని నరసాపురంకు చెందిన దస్తగిరి బాషా అనే వ్యక్తికి ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు కూతుళ్లు , కుమారుడు షాన్వాజ్ (4) సంతానం. మున్నీ పుట్టినిళ్లు అయిన నెలగొండలో మూడు రోజులుగా నూతనంగా నిర్మించిన వీరాంజనేయ ఆలయ ప్రారంభోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగానే మున్నీ కూడా తన పుట్టినింటికి వెళ్లింది. అయితే శుక్రవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు షాన్వాజ్ ఉన్నట్టుండి రోడ్డుపైకి వెళ్లాడు. అదేసమయంలో అటు నుంచి వేగంగా వచ్చిన ఆటో బాలుడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన షాన్వాజ్‌ను కుటుంబ సభ్యులు వెంటనే గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. దీంతో బాలుడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల కన్నీరు మున్నీరయ్యారు. ప్రమాదానికి కారణమైన ఆటో డ్రైవర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.



కన్నీరు మున్నీరవుతున్న బాలుడి తల్లి, కుటుంబ సభ్యులు (ఇన్‌సెట్‌లో) మృతుడు షాన్వాజ్



హత్యాయత్నం చేసిన వ్యక్తి మృతి



నరసింహమూర్తి (ఫైల్)

పరిగి: మండలంలోని ఊటుకూరులో మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ మల్లేష్ అనే వ్యక్తిపై కత్తితో దాడి చేసి, ఆపై పరిగి పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నరసింహమూర్తి అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందారు. పరిగి ఎస్ఐ నరేంద్ర తెలిపిన వివరాలమేరకు... ఊటుకూరులో మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేసిన మల్లేష్, అదే గ్రామానికి చెందిన నరసింహమూర్తి గత నాలుగు రోజుల క్రితం వ్యక్తిగత విషయంలో గొడవ పడ్డారు. అదే రోజు మల్లేష్‌పై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. రెండురోజుల క్రితం నరసింహమూర్తి పరిగి పోలీస్‌స్టేషన్ ముందు పురుగుల మందుతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. దీంతో అదే రోజు నరసింహమూర్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈక్రమంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నరసింహమూర్తిని మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు అమర్‌నాథ్

చెన్నేకొత్తపల్లి: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని గంగినేపల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్ తెలిపిన వివరాల మేరకు.. గంగినేపల్లికి చెందిన అమరనాథ్ (37) నూతనంగా ఇల్లు నిర్మిస్తున్నారు. ఇంటికి నీరు పెట్టేందుకుగాను వాడుతున్న మోటర్‌కు కనెక్షన్ ఇచ్చే క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడ్డారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయ ఖాళీలపై కసరత్తు

రాప్తాడు రూరల్: ఉపాధ్యాయ బదిలీల్లో కీలకమైన ఖాళీలపై విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ప్రొవిజినల్ సీనియార్టీ జాబితాపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి గురువారం రాత్రి 11 గంటల సమయానికి పూర్తి చేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 731 అభ్యంతరాలు వచ్చాయి. వాటన్నింటినీ పరిశీలించి అర్హత ఉన్నవారికి పాయింట్లను కేటాయించి జాబితాలో చేర్చారు. విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం నుంచే అన్ని జిల్లాల ప్రొవిజనల్ సీనియార్టీ తుది జాబితాలను శనివారం ప్రకటించాల్సి ఉంది. ఖాళీలకు సంబంధించి ఈ ఏడాది మే 31 వరకు ఉన్న ఖాళీలన్నీ వెబ్‌సైట్‌లో పొందు పరుస్తున్నారు. శుక్రవారం రాత్రికి దాదాపు అన్ని యాజమాన్యాల్లోని అన్ని కేడర్లకు సంబంధించి దాదాపు 4,400 ఖాళీలను అప్‌లోడ్ చేశారు. మరో 300 దాకా పెరిగే అవకాశం ఉంది.

గుండెపోటుతో యువతి మృతి



దివ్య (ఫైల్)

తిరుమల: శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వెళ్తున్న ఓ యువతి గుండెపోటుతో మృతి చెందిన సంఘటన అలిపిరి నడక మార్గంలో శుక్రవారం చోటుచేసుకుంది. తిరుమల పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. శ్రీసత్యసాయి జిల్లా గోరంట్లకు చెందిన దివ్య (18) ఇంటర్ పూర్తిచేసుకుని కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు నడుచుకుంటూ బయలుదేరింది. గాలిగోపురం సమీపంలో వేగంగా నడుచుకుంటూ వచ్చిన దివ్య కూల్‌డ్రింక్ తాగిన తర్వాత గుండెపోటుతో అక్కడికక్కడే మృతి చెందింది.

నిమ్మల బతుకంతా చీకటి మయమే

- అసత్య ఆరోపణలు చేస్తే నాలుక కోస్తాం
- నిమ్మలపై నిప్పులు చెరిగిన ఎమ్మెల్యే శంకరనారాయణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: 'హిందూపురం మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప రాజకీయ అరంగేట్రం చేయక ముందు నుంచే తన ఆయిల్ మిల్లు ద్వారా ప్రభుత్వానికి కట్టాల్సిన ట్యాక్స్ ఎగ్గొట్టేందుకు కర్ణాటక రాష్ట్రానికి అక్రమంగా ఆయిల్ తరలిస్తూ చీకటి వ్యాపారం చేశారు... ఆయన బతుకు మొత్తం చీకటి మయంగా కొనసాగుతోంది' అని ఎమ్మెల్యే శంకరనారాయణ విమర్శించారు. అందువల్లే నిమ్మల కిష్టప్ప ప్రజాదరణ కోల్పోయి, వైఎస్సార్‌సీపీతో పాటు తమ కుటుంబపైన నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. శుక్రవారం స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు సుమన్‌రెడ్డి స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గోరంట్ల మండలం బూదిలి సమీపంలోని కోటిలింగేశ్వరస్వామి ఆలయ భూమిని వైఎస్సార్‌సీపీ నాయకులు కబ్జా చేశారని, అందులో తమ కుటుంబ సభ్యుల హస్తం ఉందని మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే పార్థసారధి , టీడీపీ నాయకురాలు సవితమ్మ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు. బూదిలి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 532లో 19.36 ఎకరాల భూమి పట్టా భూమిగా రికార్డులో ఉందన్నారు. అయితే అందులో 4.84 ఎకరాల భూమి దేవాలయ కమిటీ పేరున 1950లో బసమ్మ అనే మహిళ వీలునామా రాసిందన్నారు. అదే సర్వే నంబర్‌లో గుత్తివారిపల్లికి చెందిన టీడీపీ మద్దతుదారు గొల్ల నరసింహప్ప తనకూ హక్కు ఉందంటూ 2010లో తన పేరున వెబ్‌ల్యాండ్ అడంగల్‌లో ఎక్కించుకున్నారని తెలిపారు. 2022లో మలసముద్రం గ్రామానికి చెందిన రైతు రంగప్పకు విక్రయించారన్నారు. క్రయ విక్రయాల్లో తమ కుటుంబానికిగాని, పార్టీకిగాని ఎలాంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. కేవలం అధికార పార్టీ పై అభాండాలు వేసి రాజకీయ లబ్ధి పొందడానికే తమ కుటుంబ సభ్యులు దేవుని భూమి కబ్జా చేశారని ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎంపీ నిమ్మల కిష్టప్ప రాజకీయాల్లోకి రాక ముందు నుంచే చీకటి వ్యాపారం చేసిన నీచుడన్నారు. ఎంపీ , ఎమ్మెల్యే, మంత్రి అయిన తరువాత అనేక చోట్ల ప్రభుత్వ భూములను ఆక్రమించడంతో పాటు అక్రమ నిర్మాణాలు చేసి డబ్బు దోచుకున్నారని విమర్శించారు. పట్టణంలోని మాధవరాయ దేవాలయం భూమిని ఆక్రమించి భక్తులకు ఇబ్బంది కలిగించడంతో పాటు ఆ స్థలంలో రూములు నిర్మించి బాడుగలను ఎంపీ నిమ్మల తీసుకుంటున్నారన్నారు. అలాగే వడిగేపల్లి సమీపంలో రైతుల నుంచి గతంలో బలవంతంగా భూములుకొని అందులో కొంత ప్రభుత్వ భూమిని కూడా కలిపేసుకున్నారని చెప్పారు. ఎంపీ నిమ్మల సాధారణ గొర్రెల కాపరులకు అందాల్సిన కేంద్ర ప్రభుత్వ సబ్సిడీని నొక్కేశారన్నారు. మల్లాపల్లి సమీపంలో కంకర మిషన్ కోసం నిమ్మల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని విమర్శించారు. టీడీపీ హయాంలో నిమ్మల కుటుంబ సభ్యులు చేస్తున్న ఇసుక మాఫియాను అడ్డుకోబోయిన సొంత పార్టీ కార్యకర్త గొల్ల నరేష్ అనే వ్యక్తిని హత్య చేసి సాధారణ మరణంగా చిత్రీకరించిన ఘనత నిమ్మలకే దక్కుతుందన్నారు. 9 సంవత్సరాలు మంత్రిగా, 10 సంవత్సరాలు ఎంపీగా ఉండి సొంత పంచాయతీని అభివృద్ధి చేయని అసమర్థుడు నిమ్మల కిష్టప్ప అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పార్థసారథి కంకర మిషన్ ఏర్పాటు కోసం అక్కమ్మ కొండను ఆక్రమించుకున్నారన్నారు. గౌరవంగా జీవనం సాగిస్తున్న తన కుటుంబంపై అసత్య ఆరోపణలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు నాలుకలు కోస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్ యార్డు అధ్యక్షులు బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు నూర్‌మహ్మద్, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, బూదిలి సహకార సంఘం అధ్యక్షుడు రఘురామిరెడ్డి, పార్టీ నాయకులు పద్మనాభరెడ్డి, నాగేనాయక్, తదితరులు పాల్గొన్నారు.